క్లుప్తంగా

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: దామాజిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, సీఈఓ నరసరాం గురువారం ఓ ప్రకటనలో సూచించారు. మార్చి 15లోపు రెన్యూవల్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు.

రేపు వేలం పాట

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మాలయం వద్ద ఏడాది పాటు టెంకాయలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కులకు శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామాంజినేయులు గురువారం తెలిపారు.

నేటి 'సదరం' క్యాంపులో మార్పులు

కదిరి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం జరగాల్సిన కంటికి సంబంధించిన సదరం క్యాంపును వాయిదా వేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వైద్యులు ప్రత్యేక విధులపై విజయవాడకు వెళ్తున్నందున సదరం క్యాంపును 28వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ముందే స్లాట్ బుక్ చేసుకున్న వారు 28వ తేదీన హాజరు కావచ్చన్నారు. అర్థో సదరం క్యాంపు శుక్రవారంతో పాటు మంగళవారం కూడా ఉంటుందని, ఇందులో ఎలాంటి మార్పు లేదన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం



తహసీల్దార్ నాగరాజును ఓటు అడుగుతున్న దృశ్యం

తాడిమర్రి: పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పట్టభద్రులను కోరారు. అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తమ్ముడు హరినాథ్‌రెడ్డితో కలసి గురువారం ఆయన ఎం.అగ్రహారం, ఆత్మకూరు, తాడిమర్రిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందిని కలసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేయాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయాల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, నాయకులు బాలం రాజశేఖర్‌రెడ్డి, సన్నప్పయ్య, హరి పాల్గొన్నారు.

పొలం పనులు చేస్తూ హఠాన్మరణం

బత్తలపల్లి: పొలం పనులు చేస్తూ రైతు హఠాన్మరణం చెందిన ఘటన పోట్లమర్రి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెడిపోతుల కాటమయ్య(60) మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. పొలంలో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం పనులు చేసుకుంటూ ఉండగా ఉన్నఫళంగా కుప్పకూలాడు. అతన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య చెన్నమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

ఎన్‌పీ కుంట: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవినాయక్, సెక్టోరియల్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎస్‌ఐ సద్గురుడు, హెచ్‌ఎం తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడి కుటుంబానికి చెక్కు అందజేత



ఆదినారాయణ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: గత ఏడాది చిత్తూరు జిలా భాకరాపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన బుక్కపట్నం మండలం మారాలకు చెందిన విలేకరి ఆదినారాయణరెడ్డి కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కును ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం అందజేశారు. మృతుడి పేరుతో మారాల సొసైటీలో క్రాప్ లోన్ ఉండగా జనతా బీమా కింద రూ.2 లక్షలు మంజూరైంది. చెక్కును ఆదినారాయణరెడ్డి భార్య గౌతమి, సోదరుడు జయరామిరెడ్డికి ఎమ్మెల్యే తన కార్యాలయంలో అందజేశారు. గౌతమికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మారాల సొసైటీ అధ్యక్షుడు బాలం రమణారెడ్డి, సీఈఓ కమలాకర్‌రెడ్డి ఉన్నారు.

కార్చిచ్చును అడ్డుకోలేమా?

- ఆకతాయిల చేష్టలతో ఏటా వేసవిలో అడవులకు నిప్పు
- పండ్ల తోటలకు వ్యాపిస్తున్న మంటలు
- సజీవ దహనమవుతున్న జంతుజాలం



బిల్వంపల్లి వద్ద మంటల్లో కాలుతున్న కొండ ప్రాంతాలు

ధర్మవరం రూరల్: వేసవి వచ్చిందంటే అటవీ ప్రాంతాలు అగ్నిగుండంలా మారుతున్నాయి. పశువుల కాపరులు, లేదా ఆకతాయిలు ఎండు గడ్డికి నిప్పు పెట్టడం, లేదా సిగరెట్లు, బీడీలు కాల్చి ఆర్పకుండా పారేస్తుండటం తదితర కారణాలతో అడవులకు నిప్పంటుకుంటోంది. దీంతో వృక్షాలు, ఔషధగుణాలున్న చెట్లు, జంతువులు, పక్షులు మంటల్లో కాలిపోతున్నాయి. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న పొలాల్లో పంటలకు మంటలు వ్యాపించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సగభాగం గ్రామాలు అటవీ ప్రాంతంలోనే

ధర్మవరం మండలంలో సుమారు 32వేల ఎకరాలకు పైబడి అటవీ విస్తీర్ణం ఉంది. మండలంలోని సగభాగం గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉన్నాయి. దర్శనమల, ఓబుళనాయనపల్లి, మల్లాకాలువ, నేలకోట, బిల్వంపల్లి, ఏలుకుంట్ల, తనకంటువారిపల్లి, రావులచెరువు, వెంకటతిమ్మాపురం, బుడ్డారెడ్డిపల్లి, మాలగుండ్లపల్లి, పోతులనాగేపల్లి, కనంపల్లి తదితర గ్రామాలు కొండ ప్రాంతాలకు దగ్గరగా ఉన్నాయి.

వేసవి వచ్చిందంటే కంటిమీద కునుకుండదు

వేసవి వచ్చిందంటే కొండ ప్రాంతాల్లోని రైతులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. ఇటీవల ధర్మవరం మండలంలోని ముచ్చురామి, ఏలుకుంట్ల, తాడిమర్రి, ముదిగుబ్బ ప్రాంతాల్లోని కొండల్లో ఆకతాయిలు రాజేసిన నిప్పుకు మామిడి, చీనీ, సపోట చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వ్యవసాయ సామగ్రి సైతం మంటల్లో కాలిపోతోంది. ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లిలో రెండు రోజుల క్రితం సోలార్ ప్లాంట్‌కు మంటలు వ్యాపించి నష్టం కలిగింది. బిల్వంపల్లి గుట్టల్లో ఆవాసాలు ఏర్పరుచుకున్న నెమళ్లు మంటల్లో కాలిపోతున్నాయని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.

అధికారులు అవగాహన కల్పిస్తున్నా...

అటవీ సంపదకు నిప్పు పెట్టవద్దని, నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ గోడలపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అడవులకు నిప్పు పెడితే తలెత్తే అనర్థాలపై నాటకాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం ఉండటం లేదు. ఆకతాయిల చేష్టలతో అడవులు కాలిపోతుండటం సాధారణంగా మారిందని గ్రామీణులు పేర్కొంటున్నారు.

రోజుల తరబడి కాలుతుంటాయి



మా ప్రాంతంలో కొండలు అధికంగా ఉన్నాయి. ఎండుగడ్డికి నిప్పు పెడుతుండడంతో రోజుల తరబడి మంటలు చెలరేగుతున్నాయి. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పచ్చని కొండలు బుగ్గి పాలవడమే కాకుండా కొండల సమీపంలోని పండ్ల తోటలు మంటల్లో కాలిపోతున్నాయి. ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టాలి.

సుదర్శన్‌రెడ్డి, రైతు, తనకంటువారిపల్లి

దుర్గమ్మ ఉట్లమాను రూపకర్త దుర్గన్న మృతి



దుర్గన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని దుర్గమ్మ ఉట్లమాను ప్రధాన రూపకర్త మేకల దుర్గన్న గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఏటా ఉగాది పండుగకు జరిగే దుర్గమ్మ పరుషకు మేకల దుర్గన్న ఆధ్వర్యంలో ఉట్లమాను కట్టడం ఆనవాయితీ. దుర్గన్న మృతికి దుర్గమ్మ ఆలయం ఉట్లమాను కమిటీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు.

బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తా



డాక్టర్ టి.సూర్య నారాయణరెడ్డి

ధర్మవరం: పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘం వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ టి.సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ పదవికి తనను ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్యే సిద్దారెడ్డి



వెన్నపూస రవీంద్రారెడ్డి ఎన్నికల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 28, 29, 32, 33, వార్డుల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి అనంతరం గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల కో ఆర్డినేటర్ వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం అని చాటాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ తోట అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సోదరుడు వెన్నపూస చంటి రెడ్డి, వార్డు ఇంచార్జ్‌లు దాదాపీర్, ఓంప్రకాష్, న్యాయవాది మహేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: రాజ్యాధికారంలో బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మరకుంటపల్లి గ్రామంలో గురువారం జరిగిన రామిరెడ్డి గృహప్రవేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చట్టసభల్లో బడుగు బలహీన వర్గాలకు వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకే పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. వడ్డెర్లకు, వాల్మీకులకు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించారన్నారు. టీడీపీ నేతలు బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప రాజకీయ ప్రాధాన్యత కల్పించిన దాఖలాలు లేవని విమర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామానికి చెందిన రామన్నను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీపీ గాయత్రి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు అశ్వర్థ రెడ్డి, యోగానంద రెడ్డి, రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం



చెడిపోతుల వీరప్పను సన్మానిస్తున్న సొసైటీ డైరెక్టర్లు శ్రీకాంత్, మక్బుల్

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ మరో వైపు రక్తదానంతో ఎంతో మందికి పునర్జన్మ కల్పించిన పోట్లమర్రి గ్రామానికి చెందిన చెడిపోతుల వీరప్పను గురువారం కర్నూలు తలసేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ కర్నూలులో ఘనంగా సన్మానించింది. ఈయన ఐదేళ్లుగా రక్తదాన ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేసి ఆదుకున్నారు. వీరప్పను డైరెక్టర్లు శ్రీకాంత్, మక్బుల్ సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు.

పాడి రైతులకు రూ.6,94,000 బోనస్ పంపిణీ



రైతులకు బోనస్ నగదు అందజేస్తున్న విజయ డెయిరీ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పాడి రైతులకు రూ.6,94,000 బోనస్‌గా అందించినట్లు విజయ డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల కేంద్రంలోని విజయ డెయిరీ కార్యాలయం వద్ద 600 మందికి 3,47,000 లీటర్లకు లీటరుకు రూ.2 చొప్పున బోనస్ కింద రూ.6,94,000 రైతులకు అందించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా విజయ డెయిరీ సేవలందిస్తోందన్నారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన బోనస్‌ను రైతులకు అందించామన్నారు. ప్రైవేట్ డెయిరీల పోటీ ఎక్కువగా ఉన్నా ఇటు పాల ఉత్పత్తిదారులు విజయ డెయిరీని ఆదరిస్తున్నారన్నారు. విజయ డెయిరీ లాభాల బాట పట్టడానికి దోహదపడిన ఉద్యోగులు, కార్మికులకు కూడా త్వరలో రూ.2,20 కోట్ల బోనస్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ పరమేశ్వరరెడ్డి, డీడీ రాజేష్, బీఎంసీసీ మేనేజర్ తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు





సోమశేఖర్‌రెడ్డిని, తిరుపాల్ నాయక్‌ను సన్మానించి మిఠాయిలు తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలైన ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అంగడి సోమశేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ నాయక్ గురువారం వేర్వేరుగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. అనంతరం ఎమ్మెల్యే వారిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

11 గంటల్లోపు పనులు ముగించండి



అప్పరాచెరువులో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీఓ ఆదెప్ప

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ కుందనం ఆదెప్ప గురువారం పరిశీలించారు. ఈ నెల 14వ తేదీ వరకు కూలీల వేతనాలు జమ చేసినట్లు తెలిపారు. రోజుకు రూ.257వేతనం వచ్చేలా పనులు చేయాలని సూచించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం ఆరు గంటలకే పనికి వచ్చి 11 గంటలలోపు ముగించుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు.

ఓడీ చెరువు: మండలంలోని పలు గ్రామాల్లో చేస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పోలప్ప గురువారం పరిశీలించారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలసట అనిపిస్తే నీడకు వెళ్లి సేద తీరాలన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామపురలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు పూజారి రాము(32) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు కుటుంబ పోషణ కోసం దాదాపు రూ.5 లక్షలు అప్పులు చేసిన రాము.. వాటిని తీర్చలేక మనోవేదనకు గురయ్యేవాడు. అప్పులవాళ్ల ఒత్తిళ్లు అధికం కావడంతో తన ఇంటిలో చీరతో ఉరివేసుకున్నాడు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శ్రీవారి హుండీల లెక్కింపు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 24వ తేది శ్రీవారి హుండీల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే పురుషులు పంచె, కండువా ధరించాలన్నారు. అదేవిధంగా స్వంత నగదు కలిగి ఉండరాదని, ఆభరణాలు ధరించి రాకూడదని సూచించారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న సత్యసాయి విద్యాసంస్థల సంగీత విభాగం బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైభవాన్ని చాటుతూ చక్కటి స్వరాలతో నిర్వహించిన సంగీత కచేరితో భక్తులు మైమరచిపోయారు. గురువారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి దగ్గర సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ సంగీత విభాగం బృందం సంగీత కచేరి నిర్వహించింది. సత్యసాయిని కీర్తిస్తూ ప్రేమ తత్వాన్ని కొనియాడుతూ నిర్వహించిన సంగీత కచేరి అందరినీ అలరించింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

మెనూ ప్రకారం వడ్డించండి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నిమ్మలకుంట, పోతులనాగేపల్లి, కేజీబీవీ పాఠశాలలను ఎంఈఓ సుధాకర్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కదిరి అర్బన్: ముత్యాలచెరువు సమీపంలో పాల బావి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓడీసీ మండలం మిట్టపల్లికి చెందిన గోవిందు (45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆటో నడిపి జీవనం సాగించే ఈయన కదిరి నుంచి ఆటోలో మిట్టపల్లికి వెళ్తుండగా హిందూపురం నుంచి కదిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్ర గాయాలైన అతన్ని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు



ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంటమాలజిస్ట్ కొండారెడ్డి

ప్రశాంతి నిలయం: గర్భిణుల్లో రక్తహీనత నివారించి పండంటి బిడ్డలకు జన్మ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రక్తహీనత పరీక్షల జిల్లా పరిశీలకుడు ఎంటమాలజిస్ట్ కొండారెడ్డి పేర్కొన్నారు. రెండు నెలలుగా ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో జరుగుతున్న రక్తహీనత పరీక్షల తీరుతెన్నులు, వాటిలోని ఖచ్చితత్వాన్ని, నెల వారిగా పరీక్షల ద్వారా వస్తున్న ఫలితాల తీరును పరిశీలించేందుకు గురువారం పుట్టపర్తి, బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తచెరువు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్ట్రిప్ మెథడ్, మాన్యువల్ మెథడ్‌లో పరీక్షల ద్వారా రక్తహీనత ఉన్నవారిలో ఆరోగ్య స్థితిగతులను, రక్తంలో హెమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించి తగిన వైద్యం అందిస్తామన్నారు. అనంతరం ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. వైద్యాధికారులు రాధ, వరలక్ష్మి, నాగరాజునాయక్, పీహెచ్‌ఎన్ లలితాకుమారి, సబ్‌యూనిట్ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ఓడీ చెరువు: చెరువుమునెప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాల, నవాబుకోటలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంపీడీఓ పోలప్ప గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ అమలుపై ఆరా తీశారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతుడు శివయ్య(ఫైల్)

తాడిమర్రి: మరిమాకులపల్లి గ్రామానికి చెందిన బోగం శివయ్య(40) అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. కూలీ పనులకు వెళ్లి కుప్పకూలిన ఇతన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటరమణ గుప్త మృతి



నివాళులర్పిస్తున్న వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం: ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కొప్పరం వెంకటరమణ గుప్త(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు వెంకట కృష్ణారెడ్డి వెళ్లి వెంకటరమణ గుప్త భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఉగాది రోజున గృహ ప్రవేశాలు

బత్తలపల్లి: జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి ఉగాది రోజున లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని మండల హౌసింగ్ అధికారి రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించినట్లు తెలిపారు. కాలనీల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

ఘనంగా త్రిమూర్తి శివ జయంతి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నున్న ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో గురువారం త్రిమూర్తి శివ 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, ఈశ్వరీయ విద్యాలయం నిర్వాహకురాలు రాధక్క మాట్లాడుతూ మనసు బుద్ధి ద్వారా పరమాత్మతో అనుసంధానం కావడమే రాజ యోగం అని అన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: చిగిచెర్ల గ్రామానికి చెందిన సాకే వీరనారప్ప అనే యువకుడు గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోగులకు పాలు, బ్రెడ్డు అందజేత

ధర్మవరం అర్బన్: శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. సాంబశివుడు, శేషాచారి, నాగిరెడ్డి, వినోద్, కాకుమాని సాగర్ పాల్గొన్నారు.

అక్కమ్మ దేవతామూర్తులకు పూజలు





ప్రత్యేక అలంకరణలో అక్కమ్మ దేవతలు, పోతలప్ప స్వామి

పుట్టపర్తి టౌన్: పెద్దకమ్మవారిపల్లి సమీపంలోని చింతతోపులో పోతలప్ప, చెన్నకేశవ, లింగమయ్య స్వాముల ఉత్సవాలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా అక్కమ్మ దేవతలకు పూజలు చేశారు. ఏడుగురు బాలికలను అక్కమ్మగార్ల దేవతలుగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం పోతలప్ప ఆలయం వద్ద పలు గ్రామాల ప్రజలు ఎడ్ల బండ్ల ప్రదక్షణలు నిర్వహించి మెక్కుబడులు తీర్చుకొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖరరెడ్డికి సన్మానం



సోమశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘమైన ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కొత్తచెరువు గ్రామానికి చెందిన అంగడి సోమశేఖర్‌రెడ్డిని గురువారం పార్టీ నాయకులు పూలమాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రాధ, టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్ పాల్గొన్నారు.

ఉస్తినిపల్లిలో 1 నుంచి ఉరుసు

తనకల్లు: మండల పరిధిలోని ఉస్తినిపల్లిలో మార్చి1 నుంచి హజరత్ బాబాఫకృద్దీన్‌షా ఖాద్రీ, హజరత్ నాసర్ అలీషా, హజరత్ రహంతుల్లా షా ఖాద్రీ ఉరుసు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. మార్చి 1న గంధం ఊరేగింపు, 2న ఉరుసు, 3న తహలీలు ఫాతేహా గంధం వేడుకతో ఉరుసు ముగుస్తుందని పేర్కొన్నారు.

హమాలీ చార్జీలు లేకుండా సరుకులు సరఫరా చేయాలి

గాండ్లపెంట: మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగి నుంచి గ్రామాల్లోని చౌకదుకాణాలకు నిత్యావసర సరుకులను దిగుమతి రుసుము (హమాలీ చార్జీలు) లేకుండా సరఫరా చేయాలని మండల డీలర్ల సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బాబు, ఉమ్మర్‌అలీ, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.